# సబ్బండ వర్గాలకు సమ ప్రాధాన్యం

## పూలను పూజించే గొప్ప సంప్రదాయం తెలంగాణ ఆడపడుచులది: బతుకమ్మ చీరల పంపిణీలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్

మెదక్ అర్బన్/మెదక్ రూరల్, అక్టోబర్ 8: ఆడపడుచుల ఆత్మగౌరవం పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్నదని, కులమతాలకు అతీతంగా అన్ని పండుగలను ఘనంగా నిర్వహిస్తున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ అన్నారు. బతుకమ్మ చీరలను ఆదివారం జిల్లా కేంద్రం లోని గోల్కొండ వీధిలో మహిళలకు మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ... రాజకీయాలకు అతీతంగా దేశంలో ఎక్కడలేని విధంగా తెలంగాణ ప్రభుత్వం అన్ని పండుగలకు అత్యంత ప్రాముఖ్యతను ఇవ్వడం ఎంతో గొప్ప విషయమని, అన్ని మతాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ గౌరవిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ చరిత్రలో నిలిచిపోతారని కొనియాడారు. పూలను పూజించే గొప్ప సంప్రదాయం తెలంగాణ ఆడపడుచులదని, బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మధు, మున్సిపల్ కమిషనర్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్

### ఆడపడుచుల ఆత్మగౌరవం

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల బతుకమ్మ వేడుకలకు చీర సారె అందించి ఆదరిస్తున్న ఏకైక సీఎం కేసీఆర్ అని సర్పంచ్ సిద్దగౌడ్ కొనియాడారు. ఆదివారం మెదక్ మండల పరిధిలోని రాయిన్‌పల్లిలో సర్పంచ్ సిద్దగౌడ్, తిమ్మక్కపల్లిలో వార్డు సభ్యులు కృష్ణ బతుకమ్మ చీరెలను పంపిణీ చేశారు. ఆడపడుచుల ఆత్మగౌరవం పెంపొందించేందుకు ప్రభుత్వం చీరలను పంపిణీ చేస్తుందని, కులమతాలకు అతీతంగా అన్ని పండుగలను ఘనంగా నిర్వహిస్తున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని సర్పంచ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసి శ్రీహరి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మ చీరెలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సిద్దగౌడ్



ఎల్లమ్మను దర్శించున్న మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్

## ఎల్లమ్మను దర్శించుకున్న చైర్మన్

రామాయంపేట, అక్టోబర్ 8: రాయాయంపేట పట్టణ శివారులోని డబుల్‌బెడ్ రూమ్ కాలనీలో నూతనంగా వెలిసిన ఎల్లమ్మ దేవతను ఆదివారం రామాయంపేట మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్ దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కాలనీ అభివృద్ధికి తన వంతు కృషి ఎల్ల వేళలా ఉంటుందని, త్వరలోనే మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డిని అమ్మవారి దర్శనం చేయిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కేసీఆర్ కాలనీ సంఘం చైర్మన్ కట్ట ప్రభాకర్, గౌరవ అధ్యక్షురాలు బాలమణి, క్యాషియర్లు ఎల్లాగౌడ్, నగేశ్, చంద్రం, రమేశ్, ఉపాధ్యక్షుడు యాదగిరి పాల్గొన్నారు.




వెంకటాపూర్(కె)లో స్పోర్ట్స్ కిట్స్‌ను అందజేస్తున్న సర్పంచ్

## క్రీడలతో మానసిక ఉల్లాసం

నిజాంపేట, అక్టోబర్ 8: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని వెంకటాపూర్(కె) సర్పంచ్ అనిల్‌కుమార్ అన్నారు. ఆదివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో యువకులకు సీఎం కేసీఆర్ స్పోర్ట్స్ కిట్‌ను సర్పంచ్ అందజేశారు. గ్రామీణ ప్రాంతల్లో క్రీడాకారులను తయారు చేసేందుకు ఈ స్పోర్ట్స్ కిట్స్ ఎంతగానో దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శేఖర్, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు దుబ్బరాజు, మాజీ సర్పంచ్ ధర్మారెడ్డి తదితరులు ఉన్నారు.



కేసీఆర్ కాలనీలో రేషన్ దుకాణం ప్రారంభిస్తున్న చైర్మన్ పల్లె

## 'కేసీఆర్ కాలనీ'లో రేషన్ షాపు ప్రారంభం

రామాయంపేట, అక్టోబర్ 8: పట్టణంలోని డబుల్ బెడ్రూం ఇండ్లలోని 'కేసీఆర్ కాలనీ'లో నూతనంగా మంజూరైన రేషన్ దుకాణాన్ని ఆదివారం మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన రేషన్ దుకాణాన్ని కాలనీలోని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం పేదలకు వెన్నంటి ఉండి సేవ చేయడమే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. రామాయంపేటకు 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న కేసీఆర్ కాలనీ వాసులకు ప్రభు త్వం రేషన్ దుకాణాన్ని మంజూరు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో కాలనీ చైర్మన్ ప్రభాకర్, బాలమణి, ఎల్లాగౌడ్, నగేశ్, సాదుల యాదగిరి, అల్లాడి సత్యం, అవుసుల రవి, ఎరుకల నర్సింహులు, చంద్రం, కాసర్ల రమేశ్, దేవుని శ్రీనువాస్, మల్లే శం, రవి, గంగారాం, డీలర్ శ్రీనువాస్ పాల్గొన్నారు.



ఖాజీపల్లిలో విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్ అందజేస్తున్న జడ్పీ వైస్ చైర్మన్ లావణ్యారెడ్డి, వైస్ ఎంపీపీ

## గ్రామీణ క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం

- క్రీడా ప్రాంగణం ప్రారంభించిన జడ్పీ వైస్‌చైర్ పర్సన్ లావణ్యారెడ్డి

మెదక్ రూరల్, అక్టోబర్ 8: తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను మరింత ప్రోత్సహించడానికి ప్రతి గ్రామంలో తెలంగాణ క్రీడా ప్రాంగణాలను నిర్మించి క్రీడాకారులకు ప్రాధాన్యత కల్పిస్తుందని జడ్పీ వైస్ చైర్ పర్సన్ లావణ్యారెడ్డి అన్నారు. ఆదివారం మెదక్ మండల పరిధిలోని ఖాజీపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో తెలంగాణ క్రీడా ప్రాంగణంను వైస్ ఎంపీపీ మార్గం ఆంజనేయులుతో కలిసి ఆమె ప్రారంభించారు. అనంతరం 'కేసీఆర్ స్పోర్ట్స్ కిట్స్' యువకులకు విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పల్లెలో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుతో గ్రామంలో మంచి వాతావరణం ఏర్పడుతుందన్నారు. క్రీడా ప్రాంగణాలను కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లను యువత సద్వినియోగం చేసుకుని క్రీడారంగాల్లో రాణించాలన్నారు. క్రీడా ప్రాంగణం చుట్టూ నీడనిచ్చే మొక్కలు పెంచాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వప్న, ఆత్మకమిటీ చైర్మన్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.



పాపన్నపేటలో ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న రోగులు

## ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

పాపన్నపేట, అక్టోబర్ 8: హైదరాబాద్‌లోని కొంపల్లి సురేఖ హాస్పిటల్ ఆధ్వర్యంలో పాపన్నపేటలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. పాపన్నపేటలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రామస్తులు పెద్ద ఎత్తున చేరుకొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి వైద్యులు కంటి అద్దాలు అందించారు. బీపీ, షుగర్, థైరాయిడ్ టెస్టులు నిర్వహించి వారికి ఉచిత సేవలు అందించారు. ఆపరేషన్ అవసరం ఉన్నవారికి ఆరోగ్యశ్రీ కార్డులో కొంపల్లి ప్రధాన బ్రాంచ్ హాస్పిటల్‌లో ఉచితంగా సేవలందిస్తామన్నారు. కార్యక్రమంలో డా.పూజ, సిబ్బంది మేనేజర్ అగ్నిస్, ప్రభాకర్, జ్యోత్స్న, అనిల్, శిరీష, స్వాతి, ఉదయ్ కుమార్‌పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

## మల్లన్న ఆలయంలో భక్తుల సందడి

మెదక్ రూరల్, అక్టోబర్ 8: మెదక్ మండల పరిధిలోని మంబోజిపల్లి శివారులోని కొయ్య గుట్టపై కొలువు దీరిన శ్రీమల్లికార్జున స్వామి అలయం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. ఆలయ పూజరి మల్లన్న ఆధ్వర్యంలో శ్రీమల్లికార్జునస్వామికి ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు మంగళహారతులతో ఒడి బియ్యం సమర్పించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

రామాయంపేట రూరల్, అక్టోబర్8: మండలంలోని దామరచెర్వు గ్రామంలో ఆదివారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ పడాల శివప్రసాద రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎన్‌ఆర్‌ఈజీఎస్)నిధులతో గ్రామంలో సీసీ రోడ్లు నిర్మించడం జరుగుతుందని, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. గ్రామంలో వీధివీధిలో సీసీ రోడ్లు నిర్మించడానికి కృషి చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దండు రమేశ్, ఎంపీటీసీ పాకాల శ్రీలత, వార్డు సభ్యులు దండు ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

చిన్నశంకరంపేట,అక్టోబర్ 8: అంబాజిపేట గ్రామానికి చెందిన కుమ్మరి యాదగిరి మృతి చెందగా, మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సౌజన్యంతో బాధిత కుటుంబానికి ఆదివారం రూ.10 వేలు స్థానిక బీఆర్ఎస్ నాయకులు బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు లక్ష్మణ్, బీఆర్ఎస్ నాయకులు బాలకిషన్, నవీన్‌గౌడ్, సాయిలు, మోహన్, నారాగౌడ్, లింగం, చంద్రాగౌడ్, నారాయణ, రాములు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## ఎస్సీ వర్గీకరణపై కేంద్రం మోసం

మెదక్ అర్బన్, అక్టోబర్8: ఎస్సీ వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని పాదయాత్రలో ఎండ కడతామని మెదక్ జిల్లా కన్వీనర్ కుమార్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. 'చలో అలంపూర్' మాదిగల విశ్వరూప మహా పాదయాత్ర అనుగుణంగా, మెదక్ నియోజకవర్గంలో కూడా ఎక్కడికక్కడ పాదయాత్రలు ప్రారంభం అవుతాయని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ సాధన కోసం పాదయాత్రతో ప్రతి పల్లెలో మాదిగలను బీజేపీపై తిరుగుబాటు చేసేలా జాగృతం చేస్తామని, మోసగించిన కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని ఆయన హెచ్చరించారు.